క్లుప్తంగా

గజ్జలమ్మ జాతరకు ఏర్పాట్లు చేయాలి



మాగనూర్: మండలంలోని కొల్పూర్ గ్రామంలో ఈ నెల 11న నిర్వహించనున్న గజ్జలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కోరుతూ శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే వారధి కమిటీ సభ్యులు పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గజ్జలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కేవీ నర్సింహులు, రాకేశ్, నవీన్, నరేష్, గొల్ల నరేష్, జంగం శ్రీపాద, మహేష్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

ముగిసిన బీరప్ప ఉత్సవాలు

ఊట్కూరు: మండల కేంద్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాలు శనివారం ముగిశాయి. బీరప్ప బండారు, ఎల్లమ్మ బండారు, జములమ్మ పట్టం కట్టడం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ప్రత్యేకాధికారి ఉమాపతి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు సహకరించిన వారికి నిర్వాహకులు గోవిందప్ప, ఆశప్ప, పోలప్ప, మహదేవ్, రామప్ప కృతజ్ఞతలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నారాయణపేట ఎడ్యుకేషన్: తెలంగాణ రాష్ట్ర బీసీ లెక్చరర్ల అసోసియేషన్ క్యాలెండర్‌ను శనివారం జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో డీఐఈఓ సుదర్శన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకట్రాములు మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధన కోసం యూనియన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ బద్ధంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. బీసీలకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల వితరణ

నారాయణపేట రూరల్: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సీసీ కెమెరాలను వితరణ చేశారు. ముందుగా పూర్వ విద్యార్థులందరూ సమావేశమై తమ గురువులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలరాజు, సీతారాములు, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

మాగనూర్: మండల కేంద్రం సమీపంలోని శ్మశానవాటిక రేకులషెడ్డులో శనివారం కొందరు పేకాట ఆడుతుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని, వారి నుంచి రూ.2,950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భార్యపై భర్త దాడి

దామరగిద్ద: కట్టుకున్న భార్యపై భర్త దాడికి పాల్పడిన ఘటన మండలంలోని నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు వివరాల మేరకు.. నర్సాపూర్‌కు చెందిన జములప్ప కూతురు అనురాధను దామరగిద్దకు చెందిన వడ్ల సాయిబన్నకు ఇచ్చి 13 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. కొన్ని రోజులుగా వారిద్దరూ తరచూ గొడవ పడుతుండే వారు. ఈ క్రమంలో ఇటీవల అనురాధ తన పుట్టింటికి వచ్చింది. శుక్రవారం సాయిబన్న నర్సాపూర్‌కు రాగా.. భార్యాభర్తల గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన సాయిబన్న అనురాధ తలపై రోకలిబండతో మోదడంతో రక్తగాయమైంది. బాధితురాలి తండ్రి జములప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాయాదుల ఘర్షణ : కేసు నమోదు

దామరగిద్ద: భూమి వ్యవసాయ పొలం విషయంలో దాయాదులు ఘర్షణకు పాల్పడిన ఘటన మండలంలో సజనాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు వివరాల మేరకు.. సజనాపూర్‌కు చెందిన గడ్డమీది చిన్న వెంకటప్ప, తన దాయాది గడ్డమీది హన్మంతు మధ్య భూతగాదా ఉంది. ఈ విషయంలో శనివారం వ్యవసాయ బోరు వద్ద గొడవ జరిగింది. ఈ క్రమంలో చిన్న వెంకటప్ప, అతడి భార్య నాగేంద్రమ్మలపై హన్మంతు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘పది’కి ప్రత్యేక తరగతులు



మొగుల్‌మడ్క పాఠశాలలో సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో రివిజన్ టెస్టు రాస్తున్న విద్యార్థులు

- ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా అడుగులు
- గత నెల 22 నుంచి కొనసాగుతున్న స్పెషల్ క్లాస్‌లు
- ఉదయం తరగతులు.. సాయంత్రం పరీక్షలు
- వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న టీచర్

దామరగిద్ద: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ పకడ్బందీగా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గతనెల 22 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8:15 నుంచి 9:15 గంటల వరకు ప్రత్యేక తరగతుల అనంతరం విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. తిరిగి సాయంత్రం 4:15 నుంచి 5 గంటల వరకు ఉదయం బోధించిన పాఠ్యాంశాలకు సంబంధించి రివిజన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 20 వరకు ప్రత్యేక తరగతులు కొనసాగనున్నాయి. పదో తరగతిలో ప్రతి విద్యార్థి 10/10 జీపీఏ సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు ముందుకు సాగుతున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ.. వార్షిక పరీక్షలకు అన్నివిధాలా సిద్ధం చేస్తున్నారు.

427 మంది విద్యార్థులు..

మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 427 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. దామరగిద్దలో 113 మంది, కంసాన్‌పల్లిలో 31, కాన్‌కుర్తిలో 111, క్యాతన్‌పల్లిలో 58, మొగుల్‌మడ్కలో 75, విఠలాపూర్‌లో 39 మంది విద్యార్థులు ఉన్నారు.

ఆకలిబాధ లేకుండా అల్పాహారం..

ఉన్నత పాఠశాలలకు స్థానిక విద్యార్థులతో పాటు సమీప గ్రామాల నుంచి వస్తుంటారు. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఆకలిబాధ పడొద్దన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద అల్పాహారం అందిస్తున్నారు.

సందేహాలు నివృత్తి..



పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో ఏ పాఠ్యాంశాల నుంచి ఎలాంటి ప్రశ్నలు వస్తాయోనన్న భయం మొదలైంది. రోజు పాఠశాలలో విన్న పాఠ్యాంశాలను ప్రత్యేక తరగతుల్లో రివిజన్ చేయడం ద్వారా సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. ఉపాధ్యాయుల సూచనల మేరకు పరీక్షలకు సిద్ధమవుతున్నాం.

– నందిని, విద్యార్థిని, జెడ్పీహెచ్‌ఎస్ మొగుల్‌మడ్క

తప్పులు సరిదిద్దుతున్నారు..



వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు మాపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. బోధించిన పాఠ్యాంశాలపై రోజు సాయంత్రం పరీక్షలు నిర్వహించి తప్పులను సరిదిద్దుతున్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధిస్తున్నాం. – అశోక్, విద్యార్థి, జెడ్పీహెచ్‌ఎస్ మొగుల్‌మడ్క

వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం..



అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రత్యేక తరగతులకు విద్యార్థులు విధిగా హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలి. – కృష్ణారెడ్డి, ఎంఈఓ

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



మరికల్‌లో పూజలు చేస్తున్న భక్తులు



మోమినాపూర్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

మద్దూరు: మండలంలోని మోమినాపూర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ధ్వజస్తంభం, బొడ్రాయి (గ్రామ దేవత) ప్రతిష్ఠాపన ఉత్సవాలను రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. పండితుడు రాఘవేంద్రాచారి బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అదే విధంగా బొడ్రాయి ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

మరికల్: మండల కేంద్రంలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శాంతిమంత్రం, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిర్లింగాల పడిపూజ



ధన్వాడలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

నర్వ/ధన్వాడ: నర్వ మండలం ఎల్లంపల్లి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం జ్యోతిర్లింగాల పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు సిద్ధయ్యస్వామి ఆధ్వర్యంలో జ్యోతిర్లింగాలకు పంచామృతాలతో అభిషేకాలు, లింగాష్టకం, బిల్వార్చన, నమకం, చమకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివస్వాముల భక్తి గీతాలు, భజనలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

■ ధన్వాడ మండలకేంద్రంలో శివ మాలధారులు మల్లికార్జునస్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. లక్ష్మీవాడలోని కొచ్చగుడి బ్రహ్మశుద్ధ మరకతలింగం వద్ద స్వామివారి మండపాన్ని ఏర్పాటుచేసి.. ప్రభు గురుస్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, 108 కళశాలతో అభిషేకం, శివపార్వతుల కల్యాణం, మెట్లపూజ నిర్వహించారు. శివ నామస్మరణతో గ్రామం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.


ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సిద్ధలింగేశ్వరస్వామి

ఊట్కూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సిద్ధలింగేశ్వరస్వామి అన్నారు. మండల కేంద్రంలోని వీరభద్రేశ్వర స్వామి దేవాలయం వద్ద జ్యోతిర్లింగాల మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వాములు కలశాలతో శోభాయాత్ర చేపట్టారు. పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం, అలంకరణ, మహా మంగళహారతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధలింగేశ్వరస్వామి మాట్లాడుతూ.. అయ్యప్ప, దత్తాత్రేయ, అంజనేయస్వామి, శివ దీక్షలతో ప్రజల్లో భక్తిభావన పెరుగుతుందన్నారు. దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రభులింగం గురుస్వామి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, భాస్కర్, జనార్దన్‌రెడ్డి, సురేష్ లింగం, అనిల్‌రాజు పాల్గొన్నారు.

రేపు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మహాధర్నా



నారాయణపేట టౌన్: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, బాలరాం తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి.. ఉపాధి హామీ పథకం, వ్యవసాయ రంగానికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. మహాధర్నాలో కర్షకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలప్ప, జోషి, బాలమణి, కాశీనాథ్, రామకృష్ణ పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్రలో విద్యార్థులు



నారాయణపేట రూరల్: మండలంలోని అమ్మిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన విహారయాత్రకు తరలివెళ్లారు. రాష్ట్రంలోని యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, హైదరాబాద్ తదితర ప్రాంతాలను సందర్శించారు. చారిత్రక కట్టడాలు, ప్రముఖ దైవక్షేత్రాలను ప్రత్యక్షంగా వీక్షించారు. పుస్తక పఠనంతో పాటు క్షేత్రస్థాయి పర్యటనలు విద్యార్థుల్లో మరింత విజ్ఞానాన్ని అందిస్తాయని ఉపాధ్యాయులు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయుడు రఘువీర్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత అందజేత



మక్తల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను శనివారం మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, నంద కిషోర్ పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి



నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు, యువత మత్తుకు దూరంగా ఉండాలని నిషా ముక్త్ భారత్ అభియాన్ వలంటీర్లు లక్ష్మీకాంత్, సంధ్య అన్నారు. జిల్లా వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వినియోగంతో జీవితాలు నాశనమవుతాయన్నారు. డ్రగ్స్, మద్యం, ధూమపానం లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్య నారాయణసింగ్, పీడీ ఫర్వీన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

మాగనూర్: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని జిల్లా హౌసింగ్ పీడీ శంకర్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నట్లు వివరించారు. రూ. 5 లక్షల వ్యయంతో తక్కువ సమయంలో పటిష్టంగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ హరికృష్ణ, ఎంపీడీఓ రహ్మతుద్దీన్, ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాకిటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

ధన్వాడ: మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని షీటీం బృందం బాలరాజు, చెన్నయ్య అన్నారు. శనివారం ధన్వాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్‌ఫోన్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని సూచించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో ఆత్మహత్యకు పాల్పడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. బాలికలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. ఎవరైనా మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని.. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న గోపాలం

మక్తల్: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గోపాలం అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీసత్య సాయి భగవాన్ మందిరంలో నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ చేసిన 9,995 మందికి రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే మంజూరు చేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలను నగదు రూపంలో చెల్లించాలని, కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మక్తల్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి 200 గజాల స్థలం కేటాయించాలని కోరారు. మార్చి చివరి వరకు తమ లైఫ్ సర్టిఫికెట్ ఎస్టీఓ ఆఫీస్‌లో అందించాలని తెలిపారు. సమావేశంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్, కోశాధికారి సిద్దిలింగయ్య, సూర్యప్రకాష్, సంజన, తులసప్ప, రాములు, నారాయణరెడ్డి, కిష్టయ్యగౌడ్, మల్లికార్జున్, జగదీశ్, రాఘవేందర్‌రావు, అరుణ, సుజాత, వెంకటేశ్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించొద్దు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దత్తురావు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించవద్దని గ్రౌండ్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దత్తురావు అన్నారు. శనివారం మండలంలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు లేకుండా వంట చేయరాదన్నారు. వంట పాత్రలు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట డీఎస్‌ఓ భానుప్రకాష్ తదితరులు ఉన్నారు.

చిన్నారుల్లో నులిపురుగులను నిర్మూలిద్దాం



కృష్ణాలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అప్రోజ్ పాషా

కోస్గి/కృష్ణా: చిన్నారుల్లో రక్తహీనత, అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగులను నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ శ్రీధర్, వైద్యులు కిష్టప్ప, అప్రోజ్ పాషా అన్నారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కోస్గి ఎంపీడీఓ కార్యాలయం, గుండుమాల్ పీహెచ్‌సీ, కృష్ణా ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆల్బెండజోల్ మాత్రలతో చిన్నారుల్లో నులిపురుగులను నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ నెల 10న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 1–19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. మాత్రల పంపిణీపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమాల్లో ఎంఈఓ శంకర్ నాయక్, మనిమాల, రవికుమార్, శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేష్‌గౌడ్, హెచ్‌ఎం వీరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు సంబరాలు



జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం ఆ పార్టీ నాయకులు జిల్లావ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. ప్రధాన చౌరస్తాల్లో బాణాసంచా కాల్చి.. మిఠాయిలు పంచిపెట్టారు. జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాలుస్తూ.. మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు సత్య యాదవ్, తిరుపతిరెడ్డి, మిర్చి వెంకటయ్య, కృష్ణ, నందు నామాజీ పాల్గొన్నారు.

■ మక్తల్‌లో బీజేపీ నాయకులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. పార్టీ శ్రేణులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, జిల్లా పొలిటికల్ జేఏసీ జిల్లా చైర్మన్ చిట్యాల లక్ష్మయ్య, నాయకులు బాల్‌రాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కర్నిస్వామి, డా.శ్రీనివాస్‌రెడ్డి, కె.నాగప్ప, మల్లికార్జున్ పాల్గొన్నారు.

■ ఢిల్లీ ప్రజలు బీజేపీకి పట్టం కట్టడం హర్షణీయమని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కోస్గి శివాజీ చౌరస్తాలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కొడంగల్ కోకన్వీనర్ కోటకొండ రాము, మండల అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, వెంకటేష్, శ్రీకాంత్, భాస్కర్, రమేష్, యాదయ్య పాల్గొన్నారు.

■ మరికల్‌లో నిర్వహించిన సంబరాల్లో బీజేపీ నా యకులు నర్సన్‌గౌడ్, వేణు, భాస్కర్‌రెడ్డి, రాజేష్, రమేష్, దేవేందర్‌గౌడ్, శ్రీరామ్, నిఖిల్, వెంకటేష్, చెన్నయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ కృష్ణాలో బీజేపీ నాయకులు విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమర్‌కుమార్ దీక్షిత్, సోమశేఖర్‌గౌడ్, నర్సప్ప, డీకే కిష్టప్ప, శంకరప్ప, శక్తిసింగ్, నాగరాజ్, రాకేశ్, సురేశ్ భట్, హన్మేష్ పాల్గొన్నారు.

■ నర్వ మండల కేంద్రంతో పాటు లంకాల్ గ్రామంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రెడ్డి, విజయ్‌రాం, అయ్యప్ప స్వామి, చాకలి హన్మంతు, పరశురాం పాల్గొన్నారు.

■ ధన్వాడలో నిర్వహించిన సంబరాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజు, సురేందర్, ఉమేష్ కుమార్, ఉదయభాను, రాంచంద్రయ్య, మల్లయ్య, గోవర్ధన్‌గౌడ్, రఘు, శ్రీనివాస్, కురుమూర్తి, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

■ మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తాలో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శంకర్, విజయభాస్కర్‌రెడ్డి, సాయిలు, భరత్, రఘు, కాశీ, రాజు పాల్గొన్నారు.